


రంగు రంగుల కలర్లు.. ఆకట్టుకునే బొమ్మలు .. అందులో నోరూరించే చిరుతిండి. వాటిని చూస్తే చాలు కొనేదాకా వదలరు చిన్నపిల్లలు. వారి నాడి పట్టిన వాటి తయారీదారులు క్వాలిటీని గాలికొదిలేసి .. ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. నాసిరకం తినుబండారాలు అందిస్తూ .. పిల్లల ఆరోగ్యానికి చేటు చేస్తున్నారు.

అగళిలోని ఓ దుకాణంలో వేలాడదీసిన రంగు రంగుల చిరుతిండ్ల ప్యాకెట్లు

అంగట్లో అనారోగ్యం!

- రంగు రంగుల ప్యాకెట్లలో ఆకట్టుకునేలా చిరుతిండ్లు
- చిన్నారుల పాలిట శాపంగా మారుతున్న ప్యాకెట్ ఫుడ్
- మడకశిర నియోజకవర్గంలో దాదాపు 800 దుకాణాల్లో విక్రయాలు
- కనీస తనిఖీలు కూడా చేయని అధికారులు

అగళి: మడకశిర నియోజకవర్గంలో దాదాపు 800 దుకాణాలు ఉన్నాయి. ఎక్కడా చూసినా నాణ్యత లేని రంగు రంగుల ఆహార పదార్థాలే దర్శనమిస్తున్నాయి. వాటి తయారీ దారులు జిమ్మిక్కులతో పిల్లలను ఆకట్టుకునేలా కార్టూన్‌లతో రంగుల ప్యాకింగుల్లో చిరుతిండ్లను తయారు చేసి విక్రయిస్తున్నారు. వీటిని చూడగానే కొనివ్వాలంటూ చిన్నారులు మారం చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

విచ్చలవిడిగా కల్తీ ఆహార పదార్థాలు

కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా నకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. అవి తయారయ్యే ప్రాంతానికి సంబంధించిన చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని అయితే ప్రముఖ కంపెనీల పేరును పోలేలా తయారు చేస్తుండటంతో వాటినే విద్యార్థులు కొనుగోలు చేస్తున్నారు. విచ్చలవిడిగా దుకాణాల్లో ప్యాకెట్ల దండలు వేలాడతీసి అమ్ముతున్నారు. ప్యాకెట్ ఫుడ్‌కు సంబంధించి జిల్లాలో రోజూ లక్షల రూపాయల్లో వ్యాపారం జరుగుతోంది.

పట్టించుకోని అధికారులు

పాఠశాలలు, ప్రధాన వీధులు, చిరు అంగళ్లు తదితర చోట్ల జోరుగా రంగు రంగు కల్తీ ఆహార పదార్థాలు కనిపిస్తున్నా జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారులతో పాటు అధికారులు కూడా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కనీస తనిఖీలు చేపట్టకపోవడంతో కల్తీ ఆహార తయారీదారులు విచ్చలవిడిగా ఆహార పదార్థాలను బహిరంగ మార్కెట్లోకి విడుదల చేసి పిల్లల అనారోగ్యానికి కారణమవుతున్నారు.

కల్తీ ఆహారంతో అనారోగ్యం



నాసిరకం చిరుతిండ్లు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. ఈ చిరుతిండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలనే ఉద్దేశంతో వాటిలో వివిధ రకాల కెమికల్స్ వాడుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మసాల, ఆకర్షణీయమైన రంగుల కోసం ప్రమాదకర పౌడర్లు వినియోగిస్తున్నారు. వాటిని తినడం వలన విద్యార్థులకు ఆరోగ్య సమస్యలు తప్పవు.

– శివనంద, వైద్యుడు, ప్రభుత్వాస్పత్రి, అగళి

పాఠశాలల్లో అవగాహన కల్పించాలి



ప్రమాదకరమైన చిరుతిండ్లను ఇళ్లలో, ఆ తర్వాత పాఠశాలల్లో చిన్నారులు తినకుండా చూడాలి. సహజసిద్ధమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలి. రెడీమెడ్ జోలికి వెళ్లకుండా పిల్లల్ని ఉంచడం ఉత్తమం. పిల్లలు మారాం చేసినా వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త తీసుకోవాలి. చిరుతిండ్లకు చిన్నారులను దూరంగా ఉంచేందుకు పాఠశాలల్లో అవగాహన కల్పించాలి.

– లక్ష్మీనరసప్ప, స్కూల్ కమిటీ వైస్ చైర్మన్, అగళి

కల్తీ పదార్థాలు అమ్మితే చర్యలు



కల్తీ ఆహార పదర్థాలు విక్రయించినా, పరిశుభ్రతను పాటించకపోయిన వాటి తయారీదారులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటాము. ప్రభుత్వ నిబంధనలమేరకు మాత్రమే ఆహార పదార్థాలను తయారీ చేయాల్సి ఉంటుంది. నాణ్యతలో కల్తీ , ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పదార్థాలను తినకూడదు. అలాగే అమ్మకూడదు.

– రామచంద్ర, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

లేపాక్షి: మండలంలోని శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రవిశంఖర్, పీఈటీ సంపత్‌కుమార్ తెలిపారు. లేపాక్షిలోని మహాత్మాజ్యోతిభా పూలే గురుకుల పాఠశాలలో గురువారం నియోజకవర్గ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికై య్యారన్నారు. అండర్-14 విభాగం హైజంప్ పోటీల్లో సందీప్ మొదటి స్థానం, వంద మీటర్ల పరుగు పందెంలో ఎస్‌జీ స్ఫూర్తి రెండోస్థానం, షాట్‌పుట్ పోటీల్లో మంజునాథ్ రెండో స్థానంలో నిలిచి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికై నట్లు చెప్పారు. ఈ సందర్భంగా వారిని ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయాల్లో పూజలు నిర్వహించండి

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిర: నియోజకవర్గ వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శనివారం దేవాలయాల్లో పూజలు నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప ఒక ప్రకటనలో తెలిపారు. తిరుమల లడ్డూ పవిత్రతపై ముఖ్యమంత్రి చంద్రబాబు అబద్ధాలు చెప్పి భక్తుల మనోభావాలను దెబ్బ తీశారన్నారు. ఈ నేపథ్యంలో పాపప్రక్షాళన చేయడానికి వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఆలయాల్లో పూజలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆలయాల్లో పూజలు చేయాలని కోరారు.

రొద్దంలో...

రొద్దం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు మండల కన్వీనర్ బి.తిమ్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పూజ ఉంటుందన్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు తప్పక హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పెనుకొండలో..

పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం పది గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ పి.సుధాకర్‌రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీజీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీమా వర్తింపజేయాలి



వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

హిందూపురం: ఖరీఫ్ సీజన్‌లో తుపానుతో పంటలను నష్టపోయిన రైతులకు బీమా వర్తింప జేసి పరిహారం అందించాలని ఏపీ రైతు సంఘం, జల సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఇందులో భాగంగానే శుక్రవారం హిందూపురం డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందించారు. నాయకులు చైతన్య గంగారెడ్డి, సిద్ధారెడ్డి మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.20 వేలు వెంటనే ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతుల బ్యాంకుల్లో ఉన్న అన్నిరకాల అప్పులు మాఫీ చేయాలన్నారు. పట్టురైతులకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ వెంటనే ఇస్తూ గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి మడకశిర బ్రాంచ్ కెనాల్ ద్వారా నీళ్లు అందించాలన్నారు. నాయకులు ఆదినారాయణరెడ్డి.నరసింహారెడ్డి, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తా

- నూతన సబ్‌రిజిస్ట్రార్ నరసింహమూర్తి



మడకశిర: నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండి పని చేస్తానని మడకశిర నూతన సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తి తెలిపారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడారు. రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పని చేస్తామన్నారు. క్రయ విక్రయాల్లో జాప్యం జరగకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు. నిబంధనల ప్రకారం క్రయ విక్రయాలు జరుపుతామన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రగతి

హిందూపురం టౌన్: స్థానిక ఏఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మీ విజన్ మా మిషన్' కార్యక్రమం జరిగింది. పరిశ్రమ ఆధారిత, నైపుణ్యత పెంపుదల విద్యపై విద్యార్థులను గ్రూపులుగా విభజించి చర్చా వేదిక నిర్వహించారు. అనంతరం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పిన్సిపాల్ ప్రగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీఓ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మడకశిరరూరల్: విద్యార్థులు విద్యతో పాటు పరిశుభ్రతను పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ప్రభుత్వ వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సరోజినిదేవి తెలిపారు. స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంజనీరింగ్ కళాశాల, ఆమిదాలగొంది ఉన్నత పాఠశాలలో విద్యార్థులు పరిశుభ్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాలలో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేశారు. జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్లు మురళీకృష్ణ, మంజుళ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్డుతో ఆరోగ్యం

పావగడ: పౌష్టికాహారమైన గుడ్డు రోజూ తినడం ద్వారా పిల్లలు, విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ తెలిపారు. తాలూకాలోని మరిదాసనహళ్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విప్రో కంపెనీ సహకారంతో శుక్రవారం నిర్వహించిన విద్యార్థులకు కోడి గుడ్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. విద్యాశాఖ బీఆర్సీ వెంకటేశ్, అక్షర దాసోహ డైరెక్టర్ శంకరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

లేపాక్షి: మండలంలోని గౌరిగానపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం ఉదయం అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, తల్లులు పౌష్టికాహార మాసోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మంజుల తల్లిపాల ప్రాముఖ్యత, లోప పోషణ, రక్తహీనత, పౌష్టికాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలు, తీసుకోకపోతే కలిగే నష్టాలను వివరించారు. ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు.

కుష్టు నివారణపై అవగాహన

పావగడ: కుష్టు వ్యాధి నివారణపై సంబంధిత సేవా సంస్థల కార్యకర్తలు, ప్రభుత్వ వైద్యులు సరైన రీతిలో ప్రజల్లో అవగాహన కల్పించి కుష్టు రహిత సమాజాన్ని ఏర్పాటు చేయాలని స్థానిక స్వామి వివేకానంద సంఘటిత గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్వాహకుడు స్వామి జపానంద సూచించారు. స్థానిక వివేకానంద ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన ఉచిత కుష్టు రోగుల అంగ వైకల్య శస్త్ర చికిత్స కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇప్పటిదాకా 635 మంది రోగులకు శస్త్ర చికిత్స నిర్వహించామన్నారు. సుమారు రూ 70 వేల ఖర్చుతో కూడిన శస్త్ర చికిత్సను డేమియన్ ఫౌండేషన్ సహకారంతో ఉచితంగా అందిస్తున్నామన్నారు. శుక్రవారం జరిగిన శిబిరంలో 9 మందికి శస్త్ర చికిత్స అందించారు.

విద్యా సామగ్రి పంపిణీ

పావగడ: తాలూకాలోని సాసలకుంట గ్రామానికి చెందిన భారత మాత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ట్రస్ట్ 8వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగానే శుక్రవారం మల్లమ్మనహళ్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు దినేశ్, రాణా ప్రతాప్ , పాఠశాల హెచ్‌ఎం సంతోష్ , సహోపాధ్యాయుడు ధర్మపాల్, విజయలక్ష్మి, దేవీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు హరికుమార్ మాట్లాడుతూ గర్భిణులు సకాలంలో మందులు, తగిన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. రక్తహీనత ఉన్న వారికి ఐరన్ మాత్రలు అందజేసినట్లు తెలిపారు. అనంతరం బద్రీ హోటల్ యజమాని మధుసూధన్ గుప్తా ఆధ్వర్యంలో ఉచితంగా భోజన వసతి కల్పించారు.

నష్టాల్లోకి వేరుశనగ రైతులు





వేరుశనగ పంట తొలగిస్తున్న కూలీలు , కాయలు సరిగా రాలేదని చూపుతున్న రైతు నాగరాజు

మడకశిర రూరల్: ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన వేరుశనగ పంట రైతులను నట్టేట ముంచింది. పెట్టిన పెట్టుబడి కూడా దక్కే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం రాక పంట ఎండిపోతుండడంతో చాలా మంది రైతులు పంటను తొలగించుకుంటున్నారు. గ్రాసమైన దక్కుతుందనే పంట తొలగిస్తున్నట్లు మడకశిర మండలం బేగార్లపల్లికి చెందిన రైతు నాగరాజు తెలిపారు.

● పొంచి ఉన్న ప్రమాదం

రొళ్ల: స్థానిక బస్టాండ్ ఆవరణంలోని సింగిల్ విండో కార్యాలయం వద్ద విద్యుత్ వైర్లు అతి తక్కువ ఎత్తులోనే వేలాడుతున్నాయి. దీంతో అటు వైపుగా లారీలు, బస్సులు, ఇతరరాత్రి 16 చక్రాల వాహలు ఏవి వచ్చినా సరే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. శుక్రవారం కూడా రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న లారీ అటుగా వచ్చింది. ఈ ప్రాంతానికి రాగానే రావి చెట్టు గుండా వివిధ షాపులు, ఇళ్లకు లాగిన సర్వీస్ వైర్లు లారీ టాప్ (పైభాగం) అడ్డుగా తగిలాయి. ఈ సమయంలో విద్యుత్ కూడా సరఫరా అవుతోంది. వెంటనే అప్రమత్తమైన లారీ డ్రైవర్ వాహనాన్ని వెంటనే ఆపారు. గమనించకపోయి ఉంటే సర్వీసు వైర్లు తెగిపోయి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది మొద్దు నిద్ర వీడి వైర్లను సరిచేయాలని కోరుతున్నారు.



లారీపైకి ఎక్కి సర్వీస్ వైరు పక్కకు జరుపుతున్న లారీ క్లీనర్

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ల నియామకం





సున్నంపల్లి వీరనారాయణరెడ్డి , బోయ తిమ్మయ్య

పెనుకొండ: నియోజకవర్గంలోని గోరంట్ల, రొద్దం మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లను నియమించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఒక ప్రకటనలో తెలిపారు. గోరంట్ల మండలానికి సున్నంపల్లి వీరనారాయణరెడ్డి, రొద్దం మండలానికి బోయ తిమ్మయ్యను నియమించినట్లు పేర్కొన్నారు. అధిష్టానంతో పూర్తిస్థాయిలో చర్చలు జరిపిన అనంతరం వారిని ఎంపిక చేశామన్నారు. పార్టీ అభ్యున్నతికి కృషి చేయాలని వారికి సూచించారు.

పురాతన కట్టడాలను పరిరక్షించుకుందాం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

పెనుకొండ: పురాతన కట్టడాలను పరిరక్షించుకోవాలని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు పేర్కొన్నారు. పట్టణంలోని కళాశాలలో శుక్రవారం చరిత్రశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పురావస్తు కట్టడాల పరిరక్షణకు పాటుపడాలని ప్రిన్సిపాల్ సూచించారు. వైస్ ప్రిన్సిపాల్ జయప్ప, అధ్యాపకులు ప్రతాప్, రామన్న తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ డీఎస్పీగా వెంకటేశ్వర్లు



పెనుకొండ: పెనుకొండ డీఎస్పీగా వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ మేరకు పోలీస్ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలను అణచి వేస్తామన్నారు.

గోరంట్ల తహసీల్దార్‌గా మారుతి



గోరంట్ల: మండల తహసీల్దార్ నియామకంతో మండల వాసుల కష్టాలు తీరాయి. తహసీల్దార్ అక్బల్‌బాషాను ప్రభుత్వం వైఎస్సార్ జిల్లాకు బదిలీ చేసింది. రెండు నెలలుగా తహసీల్దార్ లేకపోవడంతో ప్రజలు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే ఎట్టకేలకు అనంతపురం కలెక్టరేట్‌లో తహసీల్దార్ విధులు నిర్వహిస్తున్న మారుతిని ప్రభుత్వం గోరంట్ల తహసీల్దార్‌గా బదిలీ చేసింది. శుక్రవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్ మారుతి మాట్లాడుతూ మండలంలో రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు.

త్వరలో డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి సవిత

పెనుకొండ: బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పట్టణంలో త్వరలో డీఎస్సీ కోచింగ్ సెంటర్ ప్రారంభిస్తామని మంత్రి సవిత పేర్కొన్నారు. శుక్రవారం మంత్రి తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జిల్లాకు చెందిన డీఎస్సీ అభ్యర్థులకు ఉత్తమ శిక్షణ అందించాలన్న లక్ష్యంతో నియోజకవర్గ కేంద్రమైన పెనుకొండలో స్టడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామన్నారు. 16,437 టీచర్ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. అలాగే అసంపూర్తిగా నిలిచిపోయిన రొద్దం ఎంజేపీ స్కూల్ పనులు ప్రారంభిస్తున్నామన్నారు.

కట్టెలకు నిప్పు



కాలిపోతున్న కట్టెలు

మడకశిరరూరల్: మండలంలోని భీమరాయనపల్లి గ్రామ సమీపంలో బొగ్గుల కోసం రైతు పొలాల్లో సీమజాలి చెట్లను తొలగించి కట్టెలను నిల్వ చేశారు. శుక్రవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వ్యక్తులు ఆ కట్టెలకు నిప్పు పెట్టారని, దాదాపు రూ.70 వేల నష్టం జరిగిందని బాధిత రైతు తిమ్మారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ మృతి

మడకశిర: పట్టణంలో నివాసం ఉంటున్న విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ కరియప్ప అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. ఆయన పట్టణంలోని ఓం శాంతి అధ్యక్షుడిగా కూడా ఉండే వారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మమ్మ, కౌన్సిలర్ ఉమాశంకర్ తదితరులు నివాళులర్పించారు.

పాఠశాల తనిఖీ

రొళ్ల: మండల పరిధిలోని బాజయ్యపాళ్యం ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ శ్రీధర్ శుక్రవారం తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు పట్టికను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం వడ్డించాలన్నారు.

జాతీయ విద్యా విధానం వద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మడకశిర: జాతీయ విద్యా విధానం వద్దు .. రాష్ట్ర విద్యా విధానమే కావాలి అంటూ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఐసా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ర్యాలీ నిర్వహించిన తర్వాత విద్యార్థి సంఘాల నాయకులు శివకుమార్, వేమన మాట్లాడారు. పీఎం మోదీ రాష్ట్రాలపై నూతన జాతీయ విద్యా విధానాన్ని రుద్దడం తగదన్నారు. అలాగే రాష్ట్రంలో బీసీ, ఎస్టీ, ఎస్సీ, హాస్టళ్లలో మౌళిక సదుపాయాలు వెంటనే కల్పించాలన్నారు. కార్యక్రమంలో పరశురాముడు, ఇన్‌చార్జ్ పునిత్, రమేష్, అనిల్, కార్తీక్, హర్ష విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రొళ్ల: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో శనివారం ఉదయం 11 గంటలకు సాధారణ మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ కవిత అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. సమావేశానికి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

ఇంటింటా ఫీవర్ సర్వే



ఫీవర్ సర్వేలో పాల్గొన్న వైద్యసిబ్బంది

అగళి: సీజనల్ వ్యాధుల నియంత్రణకు శుక్రవారం డాక్టర్ శివానంద ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది హనుమనపల్లి గ్రామంలో ఇంటింటా ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబాల్లో జ్వరాల బారిన పడినవారు ఉన్నారా? ఉంటే ఎంత కాలంగా బాధపడుతున్నారు? తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే రక్త నమూనాలను సేకరించారు. అవసరమైన రోగులకు వైద్యచికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు.

రైతులకు ఉలవల పంపిణీ

అగళి: మండల పరిధిలోని మధూడి గ్రామం రైతు సేవా కేంద్రంలో శుక్రవారం రైతులకు సబ్సిడీతో ఉలవలను పంపిణీ చేసినట్లు అగ్రికల్చర్ అసిస్టెంట్ శివప్రియ తెలిపారు. మండలంలో సాగుచేసిన వేరుశనగ పంట పెరగడం తప్ప పంట దిగుబడి లేకపోవడం, వర్షాభావ పరిస్థితుల వల్ల వేరుశనగ పంట కొన్ని గ్రామాల్లో ఎండిపోవడంతో ప్రభుత్వం సరఫరా చేస్తున్న సబ్సిడీ ఉలవలను కొనుగోలు చేయడానికి రైతులు క్యూలైన్లో బారులు తీరారు. అధికారులు స్టాక్ ఉన్నంతవరకూ రైతులకు ఉలవలను పంపిణీ చేశారు.

అమరాపురం: స్థానిక వ్యవసాయాధికారి కార్యాలయం రైతు సేవా కేంద్రంలో ఏఓ మంజునాథ ఆధ్వర్యంలో రైతులకు శుక్రవారం ఉలవలు పంపిణీ చేశారు. రెండు రోజుల క్రితం చినుకులు పడ్డాయని, దీంతో రైతులు ఉలవలను సాగు చేయాలని ఆయన ఏఓ సూచించారు. ఉలవల కోసం నమోదు చేయించుకున్న వారికి అందించామన్నారు.

నాణ్యమైన విద్య బోధించాలి

హిందూపురం టౌన్: మండల వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఇందులో భాగంగానే ఎంఈఓ గంగప్పకు వినతిపత్రాన్ని శుక్రవారం అందించారు. ప్రభుత్వ పాఠశాలలో టీచర్ల పోస్టులను భర్తీ చేస్తూ హిందూపురం వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన భోజనాన్ని ఇవ్వాలన్నారు. వెంటనే పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు నరసింహమూర్తి , నియోజకవర్గ అధ్యక్షుడు దేవరాజు, కోశాధికారి పవన్ ఏఐఎస్ఎఫ్ పట్టణ కార్యదర్శి గోపి తదితరులు పాల్గొన్నారు.